క్లుప్తంగా

ప్రతివారం డ్రై డే పాటించాలి



గొర్రిపూడిలో పాత టైర్లలో నిల్వ నీటిని పారబోయిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కరప: అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రై డే పాటించాలని మండల ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు సూచించారు. నడకుదురు, కరప, పెనుగుదురు, గొర్రిపూడి తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి డ్రై డే గురించి వివరించి, అమలు చేయాలని కార్యదర్శులకు ఆదేశించారు. గ్రామాల్లోని తాగునీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయించాలన్నారు. గ్రామ కార్యదర్శులు, వలంటీర్లతో కలసి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నీరునిల్వ లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శులు పీఎస్సార్ బ్రహ్మానందం, ఎస్‌కే నాగేంద్రకుమార్, బి.చంద్రకళ, పి.శ్రీనివాసరావు, సచివాలయం అసిస్టెంట్లు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌ఓ



వైద్య శిబిరంలో సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ నరసింహనాయక్

కాకినాడ రూరల్: సర్పవరంలో సచివాలయం 1 పరిధిలో గ్రామస్తులకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా శుక్రవారం వైద్య సేవలందించారు. శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ జె.నరసింహనాయక్, ఎంపీడీఓ కర్రే స్వప్న తదితరులు సందర్శించారు. 409 మందికి పండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆయేషా ఫాతిమా, సిబ్బంది, స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరంలో గ్రామస్తులు వైద్యం పొందేలా సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు, ఈఓపీఆర్డీ రామాంజనేయులు, గంగాధర్ తదితరులు చర్యలు తీసుకున్నారు.

శివారులకు సాగునీరు అందించండి



బోట్‌క్లబ్: జిల్లాలో వరిసాగు పొట్టదశలో ఉందని ఈ తరుణంలో శివారు ప్రాంతాల్లో నీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి యార్లగడ్డ రామ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కాకినాడలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది లోటు వర్షపాతం వల్ల జిల్లాలో పలు ప్రాంతాల్లో సాగు చేసిన పంటలకు ప్రస్తుతం నీరు అందని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే రైతులు వేలాది రూపాయిలు పెట్టుబడి పెట్టి పంటలు పండించారని, చివరి దశలో ఉన్న పంటలు ఎండిపోతే వారు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు.

ఘనంగా ఐఈటీఈ ఆవిర్భావ దినోత్సవం



ప్రొఫెసర్ ప్రభాకరరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, బీటీ కృష్ణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్ ఇంజినీర్ (ఐఈటీఈ) 70వ అవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హెచ్.ఎం.కృష్ణప్రసాద్ హాజరై ఐఈటీఈ ఆవిర్భావం, ఆవశ్యకత వివరించారు. నానో టెక్నాలజీ అకడమిక్ అడ్వయిజర్, జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి మాజీ వీసీ డాక్టర్ ప్రభాకరరావు సంస్థ ద్వారా చేస్తున్న కార్యక్రమాలు వివరించారు. కాకినాడ చాప్టర్ సెంటర్ చైర్మన్ డాక్టర్ బీటీ కృష్ణ, ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ ప్రభాకరరావును సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, వైస్ ప్రెసిడెంట్ రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన పార్టీల ప్రచారం

కరప: గ్రామంలో శుక్రవారం టీడీపీ, జనసేనపార్టీ నాయకులు కలసి పర్యటించి ఉమ్మడి మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంచారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి, జనసేన పార్టీనాయకులు బండారు సతీష్, భోగిరెడ్డి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

ఓటు ఇక వెరీ స్మార్ట్

- కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదు
- స్మార్ట్‌ఫోన్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ చాలు
- మీ ఓటు వివరాలు మీ చేతిలో ఉన్నట్టే



ఓటు నమోదుకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొబైల్ యాప్ పోస్టర్

కాకినాడ సిటీ: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వస్తుంది. అందుకు ఆ వ్యక్తి ముందుగా ఓటరుగా నమోదు కావాలి. ఇందుకోసం ఏ కార్యాలయానికీ కాళ్లరిగేలా తిరగక్కర్లేదు. చేతిలో స్మార్ట్ ఫోన్, అందులో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ఉంటే చాలు. ఆ యాప్‌లో నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు అన్నీ ఎవరికి వారే చేసుకోవచ్చు. ఆరు నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఓటరు ముసాయిదా జాబితా విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం జిల్లాలో 1637 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఆ కేంద్రాల పరిధిలో 15,89,755 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికీ ఆ జాబితాలో పేరు లేనివారు ఆ యాప్ ద్వారా ఓటు కోసం నమోదు చేసుకోవచ్చు.

గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్..

ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అక్కడ భాషను ఎంచుకుని రిజిస్టర్ చేసుకోవాలి. తరువాత మీ ఓటు ఉందో లేదో పలు మార్గాల ద్వారా చెక్ చేసుకోవచ్చు.

బార్ కోడ్ స్కానింగ్

పాత ఓటరు కార్డు ముందు భాగంలో బార్‌కోడ్ ఉంటుంది. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లోని బార్ కోడ్ ఆప్షన్ ఎంపిక చేసుకుని కార్డుపై ఉన్న బార్ కోడ్ స్కాన్ చేస్తే మీ ఓటు వివరాలు వస్తాయి.

క్యూఆర్ కోడ్ స్కానింగ్

కొత్త ఓటరు కార్డులు క్యూఆర్ కోడ్‌తో వస్తున్నాయి. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లోని క్యూ ఆర్ కోడ్ ఆప్షన్ ఎంపిక చేసుకుని స్కాన్ చేస్తే మీ ఓటు వివరాలు తెలుస్తాయి.

వివరాలు అన్ని నమోదు చేసి

రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక ఓటరు కార్డులో ఉన్న వివరాలు నమోదు చేయాలి. తండ్రి పేరు, వయస్సు, లింగం, రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం వివరాలు నమోదు చేస్తే మీ ఓటు గురించి తెలుసుకోవచ్చు.

ఓటరు కార్డు నంబరుతో

ప్రతి ఓటు కార్డుకు నంబరు ఉంటుంది. నెంబర్ ఆప్షన్ ఎంచుకుని మీ కార్డు నంబర్ నమోదు చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

వెబ్‌సైట్ ద్వారా ఇలా..

ఓటర్లు సర్వీస్ పోర్టల్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఓటుకు సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చు. నేరుగా రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సీఈవో ఆంధ్రా.ఎన్ఐసీ.ఇన్, కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్, ఓటర్స్.ఈసీఐ.జీవోవీ.ఇన్‌లలో చెక్ చేసుకోవచ్చు. ఇంకా సందేహాలుంటే 1950 నంబర్‌కు ఫోన్ చేసి సూచనలు తీసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు ఫారం

కొత్త ఓటరుగా నమోదు కోసం ఫారం 6 దరఖాస్తును ఆన్‌లైన్‌లోనే చేసుకోవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్లు, ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు సమర్పించవచ్చు.

తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశం



తాజాగా విడుదలైన ఓటరు ముసాయిదా జాబితాలో వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో ఆన్‌లైన్‌లోనే సరి చూసుకోవచ్చు. ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మీ వివరాలు నమోదు చేస్తే యాప్‌లో డిస్‌ప్లే అవుతుంది. ఏమైనా తప్పులుంటే మళ్లీ సరిదిద్దుకునేందుకు కూడా అవకాశం ఉంది. దీనిపై ఈ నెల, డిసెంబర్ నెలల్లో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం.

– డాక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎన్నికల అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్.

6న వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈ నెల 6వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. భావి క్రియేషన్ కంపెనీలో గ్రాఫిక్ డిజైనర్, వెబ్ డెవలపర్, ఫ్రంట్ ఆఫీసు అసిస్టెంట్, సోషల్ మీడియా, మార్కెటింగ్ ఫీల్డ్ స్టాఫ్, ఇంటర్న్‌షిప్, ఎస్ఈఓ, కంటెంట్ రైటర్స్, టెక్ మహీంద్రా కంపెనీలో బీపీవో, ఈజీఓ డీల్స్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్, సోలారా యాక్టివ్ ఫార్మాసైన్సెస్‌లో ప్రొడక్షన్ టెక్నీషియన్, రిలయన్స్ రిటైల్‌లో పికింగ్ అండ్ ప్యాకింగ్, శ్రీకాళహస్తి పైప్స్ లిమిటెడ్, ఇండో ఎంఎం కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పీడీ వివరించారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఐటీఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీల్లో ఉత్తీర్ణులైన 30 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు.

ఆర్యవైశ్య సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన



వాకలపూడిలో ఆర్యవైశ్య సామాజిక సంక్షేమ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడిలో ఆర్యవైశ్య సామాజిక సంక్షేమ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శుక్రవారం శంకస్థాపన చేశారు. గ్రామంలోని ఆర్యవైశ్య సామాజిక వర్గం ఎప్పటి నుంచే తమకు సామాజిక భవనం నిర్మించాలని కోరడంతో ఎమ్మెల్యే కన్నబాబు చొరవ తీసుకున్నారు. సుమారు 500 గజాల స్థలం కేటాయించి భూమి పూజలో పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు కేటాయిస్తామని, సామాజికవర్గ పరంగా అందరూ ముందుకు వచ్చి మంచి భవనం నిర్మించుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, గోపుశెట్టి బాబ్జీ, డీఎల్‌డీఓ పాటంశెట్టి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సమాయత్తం కండి

- మళ్లీ విజయం మనదే
- పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే ద్వారంపూడి




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. హాజరైన నాయకులు కార్యకర్తలు

కాకినాడ: మార్చిలో జరగనున్న ఎన్నికలకు పార్టీ కేడర్ సమాయత్తం కావాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక డి.కన్వెన్షన్‌లో శుక్రవారం గృహసారథులు, కన్వీనర్లతో సమావేశమయ్యారు. మళ్లీ జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా ఆయన పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రానున్న వంద రోజులు ప్రజల మధ్యే ఉంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని, అదే సమయంలో రాజకీయ లబ్ధి కోసం టీడీపీ అధినేత చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇస్తున్న తప్పుడు వాగ్దానాలను కూడా అర్థమయ్యేలా వివరించాలన్నారు. గృహసారథులు, కన్వీనర్లు ప్రజల మధ్యే ఉంటూ గత, ప్రస్తుత ప్రభుత్వాల విధానాలను, సాధించిన అభివృద్ధిని వివరించాలన్నారు. నగరంలో 94 వేల ఇళ్లు ఉంటే 86 వేల కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందాయన్నారు. ప్రతి సచివాలయం వద్ద ప్రభుత్వ పథకాల లబ్ధికి సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలని, పార్టీ జెండాలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన సీఎం పారదర్శక విధానాన్ని, పాలనను ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. మరో మూడు నెలలు కష్టించి పనిచేస్తే మళ్లీ విజయం మనదేనని పేర్కొన్నారు. పార్టీ ప్రచార కార్యాచరణను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వివరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగర నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు కార్యక్రమానికి హాజరయ్యారు.

మత్స్య రంగాన్ని నిర్వీర్యం చేయొద్దు

కాకినాడ సిటీ: మత్స్య రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని, మత్స్యకారులను ఆదుకోవాలని మత్స్య, కార్మిక సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. అఖిల భారత మత్స్యకారులు, సమాఖ్య జాతీయ సమావేశాలు శుక్రవారం కాకినాడలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు 16 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. బ్లూ ఎకానమీ ఆఫ్ షోర్ ఏరియాస్ మినరల్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు ఫార్మా ఇండస్ట్రీలు రియల్ ఎస్టేట్ వ్యాపారం, టూరిజం పేర్లతో సముద్ర తీర ప్రాంతాల్లో కోస్టల్ రెగ్యులేటర్ జోన్ (సీఆర్‌జెడ్)కు విరుద్ధంగా అనేక కట్టడాలను నిర్మించి సముద్ర తీరప్రాంతాన్ని కబ్జా చేస్తున్నారన్నారు. వీటి ద్వారా వ్యర్థ రసాయన పదార్థాలు సముద్ర నీటిలో కలవడం వల్ల అనేక జీవరాసులు అంతరించిపోతున్నాయన్నారు. దీంతో మత్స్యసంపదపై ఆధారపడిన కోట్లాది మంది మత్స్యకారులు తమ జీవనాధారాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ నాయకులు పులివిలై స్టాన్లీ, కె.హేమలత, మమత, సుదాస్‌దాస్, బషీర్, లెల్లెల తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో భిక్ష

బోట్‌క్లబ్: అయ్యప్పస్వామి దీక్షాధారులకు స్థానిక రిజర్వు పోలీస్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో ఉచితంగా భిక్ష ఏర్పాటు చేసినట్లు చంద్ర షిప్పింగ్ అధినేత శ్రీరాంభగత్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన భిక్షను ఆయన ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమం జనవరి 9వ తేదీ వరకూ ఉంటుందన్నారు. ఆలయంలో ప్రతి రోజు భిక్ష స్వీకరించే స్వాములకు టోకెన్లు ఇస్తామన్నారు.

పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్




ఉద్యోగులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

- మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి
- కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతున్నందున పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సంబంధిత సిబ్బంది, అధికారులను ఆదేశించారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శుక్రవారం స్పెషల్, నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లతో ఈ మేరకు సమీక్షించారు. మొండి బకాయిలతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మరో రూ.18 కోట్లు ఆస్తిపన్ను వసూలు కావలసి ఉందన్నారు. మొండి బకాయిదారులు 511 మందికి ఇప్పటికే కుళాయి కనెక్షన్ల తొలగింపునకు నోటీసులు ఇచ్చామని, 45 కనెక్షన్లు తొలగించామని చెప్పారు. 488 మందికి రెడ్ నోటీసులు జారీ చేశామన్నారు. నీటి పన్ను బకాయిలుపై కూడా సంబంధిత ఏఈలు, ఆర్ఐలు, సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

యూజర్ చార్జీలపై సమీక్ష

మెరుగైన పారిశుధ్య సేవలకు వసూలు చేస్తున్న యూజర్ చార్జీలపై కూడా ప్రత్యేక దృష్టిపెట్టాలని కమిషనర్ ఆదేశించారు. మొదటి వారంలోనే రూ.57 లక్షలు వసూలయ్యేలా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కోరారు. యూజర్ చార్జీలు సకాలంలో వసూలు కాకపోతే నిర్వహణ ఖర్చులను కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి వెచ్చించాల్సి వస్తుందని, ఇది అభివృద్ధిపై ప్రభావం చూపిస్తోందన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, రెవెన్యూ అధికారులు చక్కా రమణ, నిర్మలకుమారి తదితరులు హాజరయ్యారు.

మళ్లీ జగనన్నే రావాలన్నది ప్రజల ఆకాంక్ష

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- 3వ డివిజన్‌లో గడప గడపకూ



సచివాలయం 3ఏ పరిధిలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: జగనన్నే మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, ఇందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి లభిస్తున్న అనూహ్య స్పందనే కారణమని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. నగరంలో రూరల్ నియోజవర్గం మూడో డివిజన్ పరిధిలో గొడారిగుంట సచివాలయం 3ఏ పరిధిలో కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి మూడు గుళ్ల సెంటరు, జయప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాలలో శుక్రవారం గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. వైఎస్సార్ సీపీ మూడో డివిజన్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్ ఆధ్వర్యంలో కన్నబాబుకు భారీ స్వాగతం పలికారు. ప్రజల సమస్యలను విని అక్కడికక్కడే సచివాలయ సిబ్బందిని పరిష్కరించాలని ఆదేశించారు. మీడియాతో మాట్లాడుతూ నాలుగున్న ఏళ్లలో సీఎం జగన్ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించారన్నారు. ప్రజలు ప్రభుత్వం పట్ల సానుకూలంగా ఉన్నారన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ నాగ నరసింహరావు, డీపీఆర్వో కృష్ణమోహన్, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, కౌడా మాజీ చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సర్పంచ్‌లు బెజవాడ సత్యనారాయణ, రామదేవు చిన్నా, మూడో డివిజన్ నాయకులు నేరేళ్ల, జగన్నాథం, విజయ్, రాజు, దైవ కృప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ ఇన్‌చార్జి మణికుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు.

మూడో రోజూ పింఛన్ల పంపిణీ



చొల్లంగి మంగమ్మకు పింఛన్ ఇచ్చేందుకు బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ కనకమహాలక్ష్మి

కరప: మండల పరిధిలో వివిధ గ్రామాల్లో శుక్రవారం కూడా పింఛన్ల పంపిణీ జరిగినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు తెలిపారు. 23 గ్రామాల్లో 11,630 మంది లబ్ధిదారులకు వివిధ రకాల పింఛన్లు రూ.3,17,40,750 ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇంతవరకూ 96 శాతం పంపిణీ జరిగిందని, ఈనెల 5వ తేదీ లోపు పింఛన్ల పంపిణీ పూర్తిచేస్తామని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు.

మాదక ద్రవ్యాలతో జీవితం దుర్భరం

పిఠాపురం: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఏఎస్పీ పి.ప్రేమ్ కాజల్ విద్యార్థులకు సూచించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మాదకదర్వ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహనా సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎక్సైజ్ సీఐ నాగవల్లి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ గ్రామంలో భర్త వేధింపులు తాళలేక వివాహిత వల్లి దుర్గాలక్ష్మి(21) శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం దుర్గాలక్ష్మికి ఏడాదిన్నర క్రితం వల్లి శ్రీనివాస్‌తో వివాహమైంది. చీడిగ ఇందిరమ్మ గృహాల్లో వారు నివసిస్తున్నారు. పెళ్లైన మొదటి మూడు నెలలు అన్యోన్యంగా ఉన్న భార్య భర్తలు తరువాత నుంచి గొడవలు పడుతున్నారు. పిల్లలు పుట్టలేదని భర్త వేధింపులకు గురి చేసేవాడు. ప్రస్తుతం దుర్గాలక్ష్మి మూడో నెల గర్భిణి. దీంతో ఆమెపై అనుమానం పెంచుకుని వేధిస్తుండడంతో భరించలేక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురారి సోదరుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై దేవసుధ తెలిపారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు

సామర్లకోట: ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ గోవిందు అన్నారు. మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలోని సిబ్బందికి శుక్రవారం స్థానిక టీటీడీసీలో ఆయన శిక్షణ నిర్వహించారు. రైతులకు ధాన్యం తేమ శాతం 17 కంటే ఎక్కువగా ఉండరాదని తెలియజేయాలన్నారు. ఈ మేరకు ధాన్యం కోత అయిన తరువాత రెండురోజుల పాటు ఆరబెట్టుకునే విధంగా వారిలో అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం రవాణాకు సంబంధించి హమాలీస్ చార్జిలతో పాటు రవాణా ఖర్చులను ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుందని చెప్పారు. ఈ మేరకు రైతులు ముందుగా పెట్టుబడి పెట్టుకోవలసి ఉంటుందని, రైతులలో అవగాహన కల్పించాలన్నారు.

విజిలెన్స్ వారోత్సవాలపై మారథాన్

బాలాజీచెరువు: విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా జేఎన్‌టీయూకే ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మారథాన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఓఎన్‌జీసీ కాకినాడ అసెట్ ఈడీ రత్నేష్ కుమార్ హాజరై మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజల్లో చైతన్యం పెంచి అవినీతి లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రమణయ్యపేట ఓఎన్‌జీసీ కార్యాలయం నుంచి నాగమల్లితోట జంక్షన్ వరకూ తిరిగి ఏఎన్‌జీసీ కార్యాలయం వరకూ మారథాన్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారులు రమణాజీ, కిరణ్మయి, వీరలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి కోసమే కుట్టుశిక్షణ



కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న పీడీ శ్రీరమణి

సామర్లకోట: ఉప ప్రణాళిక ప్రాంతంలోని యువతుల జీవనోపాధుల పెంపుదలకు ఇస్తున్న కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు, శంఖవరం మండలాల్లో వెనుబడిన ప్రాంతాల్లో నివసిస్తున్న ఎస్సీ, ఎస్టీ మహిళలను గుర్తించి వారికి కుట్టుశిక్షణను టీటీడీసీలో శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్న మహిళలకు ఉపాధి కోసం శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ నిర్ణయించారన్నారు. ఈ మేరకు ఉత్సాహం ఉన్న యువతులను ఎంపిక చేసి వారికి 30 రోజుల పాటు స్థానిక టీటీడీసీలో రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ సంకల్ప నిధులతో వీరికి శిక్షణ ఇచ్చి జీవనోపాధుల పెంపుదలకు నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ క్రాంతి పథకం డీపీఎంలు బాబురావు, రాయ్, భరత్ పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన సీనియర్ ఫ్యాకల్టీ రాణి కుట్టుశిక్షణ ఇస్తున్నారు.

దేవతామూర్తులు, కలశాలకు గ్రామోత్సవం



గురజనాపల్లిలో దేవతామూర్తులు, కలశాలను ట్రాక్టర్‌లో ఉంచి గ్రామోత్సవం జరుపుతున్న దృశ్యం

కరప: మండలం గురజనాపల్లిలో ఆధునీకరించిన షిరిడిసాయి బాబా మందిరంలో కోదండరామ, మహాగణపతి, సరస్వతి అమ్మవారు, దత్తాత్రేయ స్వామి, సమర్థసద్గురు సాయినాథస్వామి వార్ల విగ్రహాల పునః ప్రతిష్ఠలో భాగంగా దేవతామూర్తుల విగ్రహాలను, కలశాలకు గ్రామోత్సవం నిర్వహించారు. రెండో రోజు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు కర్నాసుల శివకుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.